

http://amaravathivelugu.com

RNI No. : APTEL/2022/85169

అమరావతి తెలుగు

సంచలన తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

పాత్రికేయులుగా పని చేయాలన్న ఉత్సాహం
మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన
తెలుగులో రాయగలిగిన భాషా పరిజ్ఞానం ఉన్న
ఔత్సాహికులకు ఇదే మా ఆహ్వానం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో
న్యూస్ కంట్రీబ్యూటర్లు కావలెను.
విషయ పరిజ్ఞానంతో పాటు సామాజిక,
రాజకీయ అవగాహన కలిగి స్థానికులై ఉండాలి.
వివరాలకు సంప్రదించండి :
జానపాటి వెంకట రమేష్ బాబు ఎడిటర్
9440814576

సంపుటి : 04 సంచిక : 192 ప్రచురణ : శ్రీ సత్యసాయి/అనంతపురం ఎడిటర్ : జానపాటి వెంకట రమేష్ బాబు శుక్రవారం, నవంబరు 13, 2026 పేజీలు : 4 వెల : ₹2/-

Circulated at Guntur, Palnadu, Bapatla, Chittoor, Tirupati, Madanapalli, Kurnool, Nandyal, Visakapatnam, Vijayawada, Kadikana, Kadapa, Nellore, Rajamendravaram



తెదేపా సీనియర్‌నేత శత్రుచర్ల విజయరామరాజు కన్నుమూత

పార్వతీపురం : తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు (78) కన్నుమూశారు. కొద్దిరోజులుగా విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు.

విజయరామరాజు రాజకీయ ప్రస్థానం..


1978లో జనతా పార్టీ తరఫున నాగూరు ఎమ్మెల్యేగా తొలిసారి ఎన్నిక... 1983, 1985లో కాంగ్రెస్ పార్టీ తరఫున నాగూరు నుంచి ఎమ్మెల్యేగా విజయం.... 1989, 1991లో పార్వతీపురం ఎంపీగా లోక్‌సభకు ఎన్నిక.... 1998లో తెలుగుదేశం పార్టీ తరఫున పార్వతీపురం ఎంపీగా విజయం... 1999లో నాగూరు నుంచి మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నిక.... 2004లో పార్వతీపురం శాసనసభ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం... వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో అటవీ, పర్యావరణ, సాంకేతిక శాఖల మంత్రిగా బాధ్యతలు... రోశయ్య మంత్రివర్గంలో రవాణాశాఖ మంత్రిగా సేవలు... 2017లో తెదేపా తరఫున శ్రీకాకుళం స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నిక... ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా, ఎమ్మెల్సీగా వివిధ హోదాల్లో రాజకీయ సేవలు అందించారు

నమ్మకమైన వ్యాపార భాగస్వామి ఉంటే...

విజయాలు తథ్యం..!!

- తన నాయకత్వంలో 8 సీఐఐ భాగస్వామ్య సదస్సులు జరిగాయి..
- తనపై నమ్మకంతో ఎందరో పెట్టుబడులకు ముందుకొచ్చారు...
- రూ.22.6లక్షల కోట్లకు సంబంధించిన 714 ఒప్పందాలు కుదుర్చుకున్నాం
- రెండున్నరేళ్లలో పెట్టుబడుల్లో పురోగతి సాధిస్తూ వచ్చాం
- రూ.7.3 లక్షల కోట్ల విలువైన 303 ప్రాజెక్టులు గ్రౌండింగ్‌లో ఉన్నాయి
- దేశంలోనే మొదటి హైడ్రోజన్ వ్యాలీకి రాష్ట్రం వేదిక..
- భవిష్యత్తులో కొత్త సంస్కరణలకు తిరుపతి స్పేస్ సిటీ వేదిక కాబోతోంది
- త్వరలో డ్రోన్ ఎయిర్‌టాక్సీలు రాబోతున్నాయి..
- గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుల అభివృద్ధిలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి
- అందులో 160 గిగావాట్లను ఏపీ అందించబోతోంది : సీఎం చంద్రబాబు

2వ పేజీలో



విశాఖపట్నం: నమ్మకమైన వ్యాపార భాగస్వామి ఉంటే విజయాలు తథ్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తన నాయకత్వంలో 8 సీఐఐ భాగస్వామ్య సదస్సులు జరిగాయని.. తనపై నమ్మకంతో ఎందరో పెట్టుబడులకు ముందుకొచ్చారని చెప్పారు. విశాఖలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆయన మాట్లాడారు. "2024 జూన్ నుంచి రూ.22.6లక్షల కోట్లకు సంబంధించిన 714 ఒప్పందాలు కుదుర్చుకున్నాం. రెండున్నరేళ్లలో పెట్టుబడుల్లో పురోగతి సాధిస్తూ వచ్చాం. రూ.7.3 లక్షల కోట్ల విలువైన 303 ప్రాజెక్టులు గ్రౌండింగ్‌లో ఉన్నాయి. దేశంలోనే మొదటి హైడ్రోజన్ వ్యాలీకి రాష్ట్రం వేదిక. భవిష్యత్తులో కొత్త సంస్కరణలకు తిరుపతి స్పేస్ సిటీ వేదిక కాబోతోంది. త్వరలో డ్రోన్ ఎయిర్‌టాక్సీలు రాబోతున్నాయి. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుల అభివృద్ధిలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. భారత్ 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. అందులో 160 గిగావాట్లను ఏపీ అందించబోతోంది" అని సీఎం పేర్కొన్నారు.

పెట్టుబడుల భద్రతా చట్టం చేయాలి.. సీఎం కీలక ప్రతిపాదనలు... ఈ సదస్సులో సీఎం చంద్రబాబు కీలక ప్రతిపాదనలు చేశారు. పెట్టుబడుల భద్రతా చట్టం చేయాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ను కోరారు. ప్రభుత్వాలు మారినప్పుడు కక్షపూరిత రాజకీయాల నేపథ్యంలో ఇది అవసరమన్నారు. దీనిపై చట్టం చేసి పంపుతామని.. దాన్ని ఆమోదించేలా చూడాలని కేంద్రమంత్రికి సీఎం విన్నవించారు. జాతీయ స్థాయిలో చట్టం చేస్తే మరింత సంతోషిస్తానని చెప్పారు. ఈ తరహా చట్టం చేయగలిగితే అభివృద్ధిలో భారత్ దూసుకెళ్తుందన్నారు.

పేదల అభివృద్ధి కోసం మార్గదర్శి బంగారు కుటుంబం... పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

> ఐదు గ్రీన్ సిటీగా అమరావతి...
> ఐదు గ్రీన్ సిటీగా అమరావతి రాజధాని నగరాన్ని నిర్మిస్తున్నాం. పారిశ్రామిక వేత్తలు అమరావతిని రెండో నివాసంగా మార్చుకోవాలి. నదుల అనుసంధానం ద్వారా నీరు వచ్చేలా కార్యాచరణ చేపట్టాం. గోదావరి-కావేరి లింక్ ద్వారా 5 రాష్ట్రాల దాహార్తి తీర్చే అవకాశం కల్పించాం. విద్యుత్ గ్రిడ్ లాగే వాటర్ గ్రిడ్ కూడా ఉంటే ప్రజలకు మరింత లబ్ధి చేకూరుతుంది. ఏపీలో 25 సెక్టోరల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. తిరుపతిని గ్లోబల్ సెమీకండక్టర్ చిప్ డిజైన్ క్యాపిటల్‌గా చేస్తాం.

> ఎస్క్రో ఖాతా ద్వారా ప్రోత్సాహకాలు...
> పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఎస్క్రో ఖాతా ద్వారా అందిస్తాం. ఇవాళ్టి నుంచే ఎస్క్రో ఖాతా పని చేయడం ప్రారంభిస్తుంది. యాక్సెస్ టూ ఈక్వాలిటీ ఇండెక్స్‌లో ఏపీ రెండో స్థానంలో ఉంది. సామాజిక, ఆర్థిక భద్రతలో కీలక స్థానం దక్కింది. పేదల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రభుత్వం పని చేస్తోంది. రూ.9.89 లక్షల కోట్ల విలువైన 303 ఎంఓయూలు చేసుకుంటాం. ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యం. అంతరిక్ష రంగానికి విడిగా రూ.25వేల కోట్లు, ఆహారశుద్ధి రంగంలో రూ.30 వేల కోట్లు, దేశ పోర్టు సరకు రవాణాలో 20 శాతం వాటా లక్ష్యంగా పని చేస్తున్నాం. పోర్టుల సామర్థ్యం, రైలు అనుసంధానం, నౌకా నిర్మాణ క్లస్టర్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నాం." అని చంద్రబాబు అన్నారు.



తెలంగాణలో 21 మంది ఐపీఎస్ అధికారుల బదిలీలు.. !!

హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్

తెలంగాణ రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్‌లు బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్ నియామకం అయ్యారు. ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ డీజీగా సజ్జనర్ బదిలీ అయ్యారు.



తొలిరోజే రూ.1.57 లక్షల కోట్ల ఒప్పందాలు....


అమరావతి : ఆంధ్రప్రదేశ్‌కు భారీగా పెట్టుబడులు తరలివస్తున్నాయి. విశాఖపట్నం వేదికగా జరుగుతున్న సీఐఐ 31వ భాగస్వామ్య సదస్సు తొలిరోజే రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వచ్చాయి. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో పారిశ్రామికవేత్తలు ఏపీ ప్రభుత్వంతో భారీగా అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. మొత్తం రూ.1,57,607 కోట్ల విలువైన 35 ఒప్పందాలు జరగ్గా.. వీటి ద్వారా రాష్ట్రంలో 52,956 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. 30 ఎంఓయూలు, 5 జీఓల ద్వారా ఈ పెట్టుబడులు రానున్నాయి. దీంతో రాష్ట్ర పారిశ్రామిక రంగంలో కొత్త

మంత్రిగా పీయూష్ గోయల్...

కఠిన నిర్ణయాలు తీసుకుంటారు

- "పీయూష్ గోయల్‌ను 20 ఏళ్లుగా చూస్తున్నా....
- పరిశ్రమల మంత్రిగా ఆయన కఠినమైన నిర్ణయాలు తీసుకుంటారు
- భారత్ గొప్పగా అభివృద్ధి చెందుతుందనే నమ్మకముంది...
- ఉగాది పచ్చడితో సహా తెలుగు సంస్కృతి గురించి తెలుసుకున్నారు
- ఆయన క్రియేటివ్‌గా ఆలోచిస్తారు : : సీఎం చంద్రబాబు

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఏదైనా మాట ఇస్తే కచ్చితంగా నిలబెట్టుకుంటారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ఆయన మాట్లాడారు. "పీయూష్ గోయల్‌ను 20 ఏళ్లుగా చూస్తున్నా. పరిశ్రమల మంత్రిగా ఆయన కఠినమైన నిర్ణయాలు తీసుకుంటారు. ఆయన నాయకత్వంలో భారత్ గొప్పగా అభివృద్ధి చెందుతుందనే నమ్మకముంది. ఉగాది పచ్చడితో సహా తెలుగు సంస్కృతి గురించి తెలుసుకున్నారు. ఆయన క్రియేటివ్‌గా ఆలోచిస్తారు" అని చంద్రబాబు అన్నారు.





పెట్టుబడులకు నమ్మకమైన ప్రాంతం ఆంధ్రప్రదేశ్

: పవన్ కల్యాణ్



విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సు జరుగుతోంది. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడారు. పెట్టుబడులకు నమ్మకమైన ప్రాంతం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా దూసుకెళ్తోందన్నారు. 1,053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఆంధ్రప్రదేశ్ బలం అని వివరించారు. ఆంధ్రప్రదేశ్ సాంకేతికతను అందిపుచ్చుకుంటోందని తెలిపారు.

మహిళల టెక్ పార్కుకు ఉచితంగా...

భూమి కేటాయిస్తాం..!!

- మహిళల నైపుణ్యాలను వెలికితీసే టెక్ పార్క్ ఏర్పాటుకు సహకరిస్తాం...
- ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా భూములు ఇస్తామని హామీ
- మహిళా పారిశ్రామికవేత్తల అభ్యున్నతికి రాయితీలు ఇస్తాం...
- మహిళలకు మూలధనం, మార్కెట్ అవకాశాలు, నాయకత్వ శిక్షణపై చర్చ
- మహిళలకు సాధికారత కల్పించడం వల్ల ఉన్నత స్థితికి చేరుతారు...
- పేదరిక నిర్మూలన కోసం డ్వాక్రా-వెలుగు కలిసికట్టుగా పనిచేస్తున్నాయి..
- మహిళా సంఘాల స్వయం బ్రాండ్ ప్రపంచస్థాయికి ఎదుగుతుంది
- మహిళా సంఘాలను బలోపేతం చేయడంపై సీఐఐ దృష్టిపెట్టాలి...
- తదుపరి సీఐఐ సదస్సులో 50శాతం మహిళల భాగస్వామ్యం ఉండాలి
- మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఉన్నతి సాధించాలి
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

..2వ పేజీలో

విశాఖపట్నం: మహిళల టెక్ పార్కు ఏర్పాటుకు భూములు కేటాయించాలని భారత్ బయోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర ఎల్ల కోరగా.. సీఎం చంద్రబాబు వెంటనే స్పందించారు. మహిళల నైపుణ్యాలను వెలికితీసే టెక్ పార్క్ ఏర్పాటుకు సహకరిస్తామన్న సీఎం.. ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా భూములు ఇస్తామని హామీ ఇచ్చారు. మహిళా పారిశ్రామికవేత్తల అభ్యున్నతికి రాయితీలు ఇస్తామని ప్రకటించారు. సీఐఐ సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన 'ఉమెన్ అండ్ గ్రోత్ సమిట్'లో స్మృతి ఇరానీ, సీఐఐ అలయన్స్ ఫర్ గ్లోబల్ గుడ్ ప్రతినిధులు పాల్గొన్నారు. మహిళలకు మూలధనం, మార్కెట్



తెలంగాణలో 21 మంది ఐపీఎస్ అధికారుల బదిలీలు..

హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్

తెలంగాణ రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్‌లు బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్ నియామకం అయ్యారు. ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ డీజీగా సజ్జనర్ బదిలీ అయ్యారు.

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో పోలీస్ శాఖలో భారీ స్థాయిలో ప్రక్షాళన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ.. కీలక పోస్టుల్లో కొత్త అధికారులను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి మహేష్ భగవత్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు హైదరాబాద్ సీపీగా బాధ్యతలు నిర్వహించిన వీసీ సజ్జనార్‌ను తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డీజీగా బదిలీ చేసింది. అలాగే జైళ్ల శాఖ డీజీగా స్వాతి లక్రా, మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల డీజీగా సౌమ్య మిశ్రాకు బాధ్యతలు అప్పగించింది. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీగా చారు సిన్హాను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒకేసారి ఇంతమంది కీలక అధికారులకు స్థానచలనం కల్పించడంతో పోలీస్ శాఖలో ఈ



బదిలీలు చర్చనీయాంశంగా మారాయి. ఇక ఇతర కీలక విభాగాల్లోనూ ప్రభుత్వం మార్పులు చేపట్టింది. టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా అనిల్ కుమార్‌కు బాధ్యతలు అప్పగించగా, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ డీజీగా విక్రమ్ సింగ్ మాన్‌ను నియమించింది. సివిల్ సప్లైస్ కమిషనర్‌గా నాగిరెడ్డికి పోస్టింగ్ ఇచ్చింది. అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్)గా ఆకున్ సబర్వాల్‌ను నియమించగా, తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ విభాగం బాధ్యతలను స్టీఫెన్ రవీంద్రకు అప్పగించింది. మల్టీ జోన్-1 ఐజీగా కార్తికేయను నియమించింది. మరోవైపు హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా జోయల్ డేవిస్‌కు అదనపు బాధ్యతలు కేటాయించింది. మొత్తం 21 మంది ఐపీఎస్ అధికారులకు సంబంధించి బదిలీలు, కొత్త పోస్టింగ్స్‌పై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్పులతో రాష్ట్ర పోలీస్ యంత్రాంగంలో కీలక విభాగాల పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే బదిలీ ఉత్తర్వుల్లోని పూర్తి వివరాలు, బాధ్యతల స్వీకరణపై అధికారిక ప్రకటనలను అనుసరించాల్సి ఉంటుంది.

నమ్మకమైన వ్యాపార భాగస్వామి ఉంటే

విజయాలు తథ్యం..!!

(మొదటిపేజీ తరువాయి) వల్ల మరింత చేయూత అందుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. పేదకుటుంబాలకు చేయూత కోసం ఎంబీకే 10-20 పర్సెంట్ ప్రణాళిక తీసుకొచ్చామన్నారు. " పేదల అభివృద్ధి కోసం మార్గదర్శి బంగారు కుటుంబం ప్రతిపాదన తీసుకువస్తున్నా. 20 శాతం బడుగు వర్గాలకు 10శాతం ఉన్నత వర్గాలు చేయూత అందించాలి. దీనివల్ల బడుగు వర్గాల జీవన ప్రమాణాలు మారుతాయి. చేయూత లేకపోతే పేద కుటుంబాలు మరింత పేదరికంలోకి వెళ్తాయి. ఉన్నత వర్గాలు, బడుగు వర్గాలకు మధ్య అంతరం మరింత పెరుగుతుంది. చాలా దేశాలు ఈ విధమైన సమస్యలు ఎదుర్కొంటున్నాయి. సమానత్వం పాటించడం వల్ల కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. సరైన మార్గనిర్దేశం వల్ల ఎంఎస్ఈలు మరింత పుంజుకుంటాయి.

మహిళల టెక్ పార్కుకు ఉచితంగా

భూమి కేటాయిస్తాం..!!

(మొదటిపేజీ తరువాయి) అవకాశాలు, నైపుణ్యాలు, నాయకత్వ శిక్షణపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం చంద్ర బాబు మాట్లాడుతూ.. "మహిళలకు సాధి కారత కల్పించడం వల్ల ఉన్నత స్థితికి చే రుతారు. పేదరిక నిర్మూలన కోసం ద్వా క్రా-వెలుగు కలిసికట్టుగా పనిచేస్తున్నా యి. మహిళా సంఘాల స్వయం బ్రాండ్ ప్రపంచస్థాయికి ఎదుగుతుంది. మహిళా సంఘాలను బలోపేతం చేయడంపై సీఐ ఐ దృష్టిపెట్టాలి. తదుపరి సీఐఐ సదస్సులో 50శాతం మహిళల భాగస్వామ్యం ఉండాలి. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఉన్నతి సాధించాలి. వారికి రాజకీయ సాధికారత మేము కల్పిస్తాం, మీ సహకారం వల్ల మహిళలకు ఆర్థిక సాధికారత సాధ్యం అవుతుంది" అని సీఎం అన్నారు.

'కియా' విస్తరణకు కీలక ఒప్పందం..

12వేల మందికి ఉద్యోగ అవకాశాలు

విశాఖపట్నం: ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఏపీ ప్రభుత్వం, కియా పరిశ్రమ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. రాష్ట్రంలో కియా కార్ల తయారీ ప్లాంట్‌ను



విస్తరించనున్నట్లు ఆ సంస్థ ఇండియా ఎండీ గ్వాంగూ లీ ప్రకటించారు. దాదాపు రూ. 18,787 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపారు. విశాఖలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఆ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఏటా 2 లక్షల వాహనాల తయారీ సామర్థ్యంతో శ్రీసత్యసాయి జిల్లాలోనే రెండో ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కియా కంపెనీ వెల్లడించింది. 2030లో ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు తెలిపింది. ప్లాంటు విస్తరణ ద్వారా దాదాపు 12వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని సంస్థ పేర్కొంది.

ఏపీకి పెట్టుబడుల వరద..

తొలిరోజే రూ.1.57 లక్షల కోట్ల ఒప్పందాలు

(మొదటిపేజీ తరువాయి) అవకాశాలకు మార్గం ఏర్పడనుంది.

మెగా ఇంజనీరింగ్, క్లీన్ మ్యాక్స్ భారీ పెట్టుబడులు.. ఈ సదస్సులో రెన్యువబుల్ ఎనర్జీ, మౌలిక సదుపాయాలు, ఏరోస్పేస్, హెల్త్‌కేర్, పర్యాటక రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు సంస్థలు ఆసక్తి చూపించాయి. మెగా ఇంజనీరింగ్ సంస్థ మూడు ఎంఓయూల ద్వారా ఏకంగా రూ.39,400 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థ పెట్టుబడులతో 12,940 ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. రష్మీ మెటలర్జికల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.18,500 కోట్ల పెట్టుబడికి ముందుకొచ్చింది. క్లీన్ మ్యాక్స్ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.41 వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. యునైటెడ్ టెలికం లిమిటెడ్ సైతం రూ.9,053 కోట్ల పెట్టుబడికి ముందుకొచ్చింది. తొలిరోజే ఈ స్థాయిలో పెట్టుబడుల ఒప్పందాలు కుదరడంతో రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలపై ఆసక్తి నెలకొంది. రానున్న రోజుల్లో మరిన్ని సంస్థలు పెట్టుబడులకు ముందుకొస్తాయని సదస్సు వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

ఇన్వెస్టర్లు కుదుర్చుకున్న ఎంఓయలు, జీఓ ఎక్స్చేంజిల వివరాలు..

1. రష్మీ మెటలర్జికల్ - రూ.18,500 కోట్లు పెట్టుబడి - 10,000 ఉద్యోగాలు
2. రెన్యూ ఫోటోవోల్టాయిక్స్ - రూ.8,500 కోట్లు పెట్టుబడి - 800 ఉద్యోగాలు
3. రెన్యూ ప్రైవేట్ లిమిటెడ్ - 42 కోట్లు పెట్టుబడి - 1,500 ఉద్యోగాలు
4. చీఁా.చీ మాగ్నెటెక్ - 3,000 కోట్లు పెట్టుబడి - 1,000 ఉద్యోగాలు
5. చీఁా.చీ సెలాక్స్ గ్రీన్‌మెట్ - 1,800 కోట్లు పెట్టుబడి - 1,000 ఉద్యోగాలు
6. వెల్సపన్ గ్రూప్ - 2,500 కోట్లు పెట్టుబడి - 3,500 ఉద్యోగాలు
7. ఎవర్‌వోల్ట్ సోలార్ టెక్నాలజీ - 2,350 కోట్లు పెట్టుబడి -- 1,200 ఉద్యోగాలు
8. మేఘా ఇంజినీరింగ్ ఁ ఇన్ఫ్రా - 2,300 కోట్లు పెట్టుబడి - 1,500 ఉద్యోగాలు
9. MEIL-ఎక్విప్‌మెంట్ స్కిడ్స్ - 1,100 కోట్లు పెట్టుబడి - 2,500 ఉద్యోగాలు
10. మేఘా ఇంజినీరింగ్ ఁ ఇన్ఫ్రా - 36,000 కోట్లు పెట్టుబడి - 8940 ఉద్యోగాలు
11. హీరో మోటర్ కార్ప్ - 1,457 కోట్లు పెట్టుబడి - 1,000 ఉద్యోగాలు
12. పిఫైజర్ హెల్త్ కేర్ - రూ.983 కోట్లు పెట్టుబడి - 150 ఉద్యోగాలు
13. బ్లూజెట్ హెల్త్ కేర్ - 500 కోట్లు పెట్టుబడి - 1,000 ఉద్యోగాలు
14. ట్రైఫోస్ పవర్ - రూ.500 కోట్లు పెట్టుబడి - 200 ఉద్యోగాలు
15. రఘు వంశీ ఎయిరోస్పేస్ గ్రూప్ - 300 కోట్లు పెట్టుబడి - 300 ఉద్యోగాలు
16. రఘు వంశీ ఎయిరోస్పేస్ గ్రూప్ - 250 కోట్లు పెట్టుబడి - 300 ఉద్యోగాలు
17. సిటోటో డిజిటల్ పర్సనాలిటీ - 250 కోట్లు పెట్టుబడి - 230 ఉద్యోగాలు
18. ప్రీమియర్ ఎనర్జీస్ - 100 కోట్లు పెట్టుబడి - 75 ఉద్యోగాలు
19. డెల్టాక్స్ - 42 కోట్లు పెట్టుబడి - 110 ఉద్యోగాలు
20. క్లీన్ మాక్స్ ఇన్విరో ఎనర్జీ సొల్యూషన్స్ - 41,000 కోట్లు పెట్టుబడి - 600 ఉద్యోగాలు
21. రేస్ పవర్ - 9,660 కోట్లు పెట్టుబడి - 500 ఉద్యోగాలు
22. రేస్ ఫ్యూయల్స్ - 3,000 కోట్లు పెట్టుబడి - 80 ఉద్యోగాలు
23. యునైటెడ్ టెలికామ్స్ - 9,053 కోట్లు పెట్టుబడి - 1,200 ఉద్యోగాలు
24. వీఁీా సొల్యూషన్స్ - 750 కోట్లు పెట్టుబడి - 500 ఉద్యోగాలు
25. క్లారస్ ఎనర్జీ - 100 కోట్లు పెట్టుబడి - 50 ఉద్యోగాలు
26. ఫ్యాబ్రిక్ - 4,300 కోట్లు పెట్టుబడి - 10,000 ఉద్యోగాలు
27. SLN కాఫీ - 2,500 కోట్లు పెట్టుబడి - 1,400 ఉద్యోగాలు
28. మానే గ్లోబల్ - 120 కోట్లు పెట్టుబడి - 250 ఉద్యోగాలు
29. డీఎస్ఆర్ హాస్పిటాలిటీ సర్వీసెస్ - 140 కోట్లు పెట్టుబడి - 140 ఉద్యోగాలు
30. ది పార్క్ హోటల్ - 115 కోట్లు పెట్టుబడి - 150 ఉద్యోగాలు

జీఓ ఎక్సేంజ్ ద్వారా ఒప్పందాలు..

1. ఎం వెంకటరావు ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ - 3,078 కోట్లు పెట్టుబడి - 1,300 ఉద్యోగాలు
2. జాక్సన్ గ్రీన్ రెన్యూవబుల్స్ - 1,533 కోట్లు పెట్టుబడి - 250 ఉద్యోగాలు
3. ఓషిఆర్ గ్రీన్ ఫ్యుయిల్స్ - 616 కోట్లు పెట్టుబడి - 130 ఉద్యోగాలు
4. రెసల్వెన్ టూ ఎనర్జీ - 980 కోట్లు పెట్టుబడి - 250 ఉద్యోగాలు
5. గ్రాండ్ తిరుపతి హోటల్స్ ఁ రిసోర్ట్స్ - 188 కోట్లు పెట్టుబడి - 851 ఉద్యోగాలు

అల్పపీడనంపై కచ్చితమైన రిపోర్ట్.. తుఫాన్‌గా మారుద్దా..?

ఏయే ప్రాంతాలపై ప్రభావం ఉంటుంది..?

ప్రస్తుతం పొడి వాతావరణం ఉన్నా, బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఇది వాయుగుండంగా బలపడి, నవంబర్ 15, 16 నాటికి తీరం వైపు కదిలే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాలకు వర్షాలు ఉంటాయా లేదా అనేది దాని గమనంపై ఆధారపడి ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రస్తుతానికి పొడి వాతావరణం నెలకొంది. గత కొన్ని రోజులుగా తెలుగు రాష్ట్రాలను తుఫానులు, భారీ వర్షాలు భయపెట్టినప్పటికీ, ప్రస్తుతం వర్షాలు లేవు. అయితే బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ అప్రమత్తంగా ఉంది. భారత వాతావరణ శాఖ (IMD) అంచనాల ప్రకారం, నవంబర్ 13, 14 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా మారనుంది. ఇది క్రమంగా బలపడి, నవంబర్ 14, 15 నాటికి తీవ్ర అల్పపీడనంగా,ఆ తర్వాత నవంబర్ 15, 16 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని IMD అంచనా వేస్తోంది.

ఆంధ్రప్రదేశ్ వాతావరణం... ప్రస్తుతానికి ఆంధ్రప్రదేశ్‌లో వర్ష సూచనలు లేవని xవీణ వెల్లడించింది. విశాఖపట్నం వాతావరణ కేంద్రం నివేదిక ప్రకారం, గురు, శుక్రవారాల్లో వర్షాలు పడే అవకాశం లేదు. అయితే దక్షిణ అండమాన్ సముద్రం మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నందున, దీని ప్రభావంతో అల్పపీడనం ఏర్పడి వాయువ్య దిశగా కదులుతూ బలపడే అవకాశం ఉంది.

మత్స్యకారులకు హెచ్చరికలు, తీరప్రాంత ప్రజలకు సూచనలు... నవంబర్ 15 వరకు ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత మత్స్యకారులకు ఎలాంటి ప్రమాద హెచ్చరికలు లేవని అధికారులు తెలిపారు. ప్రస్తుతం వాతావరణం ప్రశాంతంగానే ఉంది. అయితే అండమాన్ సముద్ర ప్రాంతంలో గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున, ఆ ప్రాంతానికి వెళ్ళకుండా ఉండటం మంచిదని సూచించారు. నవంబర్ 13 తర్వాత వాతా వరణ శాఖ జారీ చేసే సూచనలకు అనుగుణంగా తీరప్రాంతాల్లో నివసించే ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరారు. ముఖ్యంగా కోతకు వచ్చిన పంటలు ఉన్న రైతులు నవంబర్ 15 తర్వాత విడుదలయ్యే హెచ్చరికలను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతానికి తుఫాను హెచ్చరికలు లేనందున సాధారణ ప్రయాణాలకు ఎలాంటి ఆటంకము లేదని స్పష్టం చేశారు.



తెలంగాణ వాతావరణం... తెలంగాణలో దాదాపు వారం రోజులుగా పొడి వాతావరణమే నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉన్నప్పటికీ, వర్షాలు లేవు. హైదరాబాద్, రామగుండం, హనుమకొండ, ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్ వంటి ప్రాంతాల్లో పొడి వాతావరణం కొనసాగుతోంది. నవంబర్ 15వ తేదీ వరకు తెలంగాణలో ఎలాంటి వర్ష సూచన లేదని IMD నివేదించింది. అయితే, వాతావరణ నిపుణుల అంచనా ప్రకారం నవంబర్ మూడో వారంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం గమనాన్ని బట్టి తెలంగాణలో వర్షాలు కురుస్తాయా లేదా అనేది ఆధారపడి ఉంటుందని IMD అధికారులు తెలిపారు. ప్రస్తుత అధికారిక నివేదికల ప్రకారం తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశం తక్కువగా ఉంది.

సంపాదకీయం

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల..

మూడు దశల్లో పంచాయతీ పోరు!

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (రాజుజ) సిద్ధమైంది. ఇప్పటికే తొలి దశలో 100 అర్బన్ లోకల్ బాడీలకు ఎన్నికలు



నిర్వహించగా.. పెండింగ్‌లో ఉన్న మరో 23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేత వెల్లడించారు. ఈ మేరకు నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికల షెడ్యూల్‌తో పాటు ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ఓటింగ్ శాతంపై కీలక వివరాలు వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (SEC) సిద్ధమైంది. ఇప్పటికే తొలి దశలో 100 అర్బన్ లోకల్ బాడీలకు ఎన్నికలు నిర్వహించగా.. పెండింగ్‌లో ఉన్న మరో 23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేత వెల్లడించారు. ఈ మేరకు నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికల షెడ్యూల్‌తో పాటు ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ఓటింగ్ శాతంపై కీలక వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం, కాకినాడ, రాజమండ్రి, మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్లతో పాటు మరో 19 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. అర్బన్ లోకల్ బాడీల పరిధిలో నవంబర్ 14 నుంచి 16వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 17న నామినేషన్ల పరిశీలన, 19న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పిస్తారు. నవంబర్ 26న పోలింగ్ నిర్వహించి.. 30వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ ప్రాంతాల్లో నేటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని రాజుజ స్పష్టం చేశారు. మరోవైపు రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి దశకు రేపు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. తొలి దశలో నవంబర్ 26న, రెండో దశలో నవంబర్ 29న, మూడో దశలో డిసెంబర్ 2న పోలింగ్ జరగనుంది. ప్రతి దశలోనూ పోలింగ్ ముగిసిన రోజే ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందని అనిల్ చంద్ర పునేత తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా జరిగేలా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నామినేషన్ల స్వీకరణ నుంచి ఓట్ల లెక్కింపు వరకు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్లు దాఖలు చేసే బాధ్యత పూర్తిగా జిల్లా యంత్రాంగానిదేనని స్పష్టం చేశారు. సున్నిత ప్రాంతాల్లో పోలీసుల భద్రత నడుమ నామినేషన్లు స్వీకరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కోసం నాలుగు నెలల ముందుగానే అవసరమైన ఏర్పాట్లు ప్రారంభించామని, పోలింగ్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రాల వరకు పటిష్ట భద్రత కల్పిస్తామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రాంతాల్లోనూ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పల్నాడు, రాయలసీమ జిల్లాల్లో ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఈ నెల 14న ఆయా జిల్లాల ఎస్పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. MPTC, ZPTC ఎన్నికల నిర్వహణకు కూడా రాజుజ తరఫున వంద శాతం ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. రాజకీయ పార్టీలు, పోటీలో నిలిచే అభ్యర్థుల నుంచి పూర్తి సహకారం లభిస్తోందన్నారు. ఇక విశాఖపట్నంలో ఓట్ల పెరుగుదలపై వచ్చిన వివాదంపై స్పందించిన రాజుజ.. పోలింగ్ స్టేషన్ వారీగా ఓటింగ్ వివరాలను ఇప్పటికే వెల్లడించామని తెలిపారు. ప్రతి ఓటును పరిశీలించి, చెల్లుబాటయ్యే ఓట్ల ఆధారంగానే తుది ఓటింగ్ శాతాన్ని ప్రకటించామని స్పష్టం చేశారు. గత స్థానిక సంస్థల ఎన్నికలతో పోలిస్తే ఈసారి రాష్ట్రంలో ఓటింగ్ శాతం పెరిగిందని అనిల్ చంద్ర పునేత వెల్లడించారు.

హెల్మెట్ లేదన్న బీమా కంపెనీకి దిమ్మతిరిగే తీర్పు..

బాధితులకు రూ.3.20 కోట్ల పరిహారం!

రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్దను కోల్పోయిన ఓ కుటుంబానికి భారీ ఊరట లభించింది. ఇండోర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శక్తి



సింగ్ చౌహాన్ కుటుంబానికి రూ.3.20 కోట్ల పరిహారం చెల్లించాలని కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. అంతేకాకుండా ఈ మొత్తానికి ఏడాదికి 6 శాతం వడ్డీ కూడా చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశించింది. ప్రమాద సమయంలో మృతుడు హెల్మెట్ ధరించలేదని, బైక్‌పై ముగ్గురు ప్రయాణిస్తున్నారని బీమా సంస్థ వాదించినప్పటికీ కోర్టు వాటిని అంగీకరించలేదు. వివరాల్లోకి వెళ్తే.. 2024 డిసెంబర్ 29న శక్తి సింగ్ చౌహాన్ తన మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తుండగా ఇండోర్‌లోని రౌ ప్రాంతంలో ఎస్‌రాక్ స్కూల్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన బస్సు అతని బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శక్తి సింగ్ చికిత్స పొందుతూ మరణించాడు. దీంతో భార్య మితాలి, కుమార్తె హిమయశి, కుమారుడు అహైత్‌తో పాటు తల్లిదండ్రులు కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర విషాదంలో మునిగిపోయారు. శక్తి సింగ్ కుటుంబానికి ప్రధాన ఆర్థిక ఆధారంగా ఉన్నారు. ఆయన వార్షిక ఆదాయం సుమారు రూ.30 లక్షలుగా నమోదైంది. దీంతో కుటుంబ సభ్యులు తగిన పరిహారం కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే పరిహారం చెల్లించకుండా ఉండేందుకు బీమా కంపెనీ పలు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ప్రమాద సమయంలో మృతుడు హెల్మెట్ ధరించలేదని, బైక్‌పై ముగ్గురు ఉన్నారని, ప్రమాదాన్ని నివేదించడంలో ఏడు రోజుల ఆలస్యం జరిగిందని వాదించింది. బస్సు డ్రైవర్‌కు అవసరమైన పత్రాలు, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నాయా అనే అంశాలను కూడా ప్రస్తావించింది. అయితే ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, పోలీసుల దర్యాప్తులో బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని వెల్లడైంది. వెనుక నుంచి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టినట్లు ఆధారాలు లభించాయి. దీంతో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి అవాన్ మహమ్మద్ బీమా సంస్థ వాదనలను తోసిపుచ్చారు. మృతుడి నిర్లక్ష్యాన్ని నిరూపించడంలో బీమా కంపెనీ విఫలమైందని స్పష్టం చేశారు. మొత్తం రూ.3,20,60,582 పరిహారాన్ని 6 శాతం వార్షిక వడ్డీతో చెల్లించాలని ఆదేశించారు. పరిహారంలో 40 శాతం భార్యకు, 20 శాతం చొప్పున ఇద్దరు పిల్లలకు, 10 శాతం చొప్పున తల్లిదండ్రులకు కేటాయించారు. ఈ తీర్పుతో కుటుంబ పోషకుడిని కోల్పోయిన బాధిత కుటుంబానికి ఆర్థికంగా కొంత భరోసా లభించనుంది.

వికసిత్ భారత్ పోటిల్లో
ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ప్రతిభ

వేంపల్లె, నవంబరు12, అమరావతి వెలుగు : వికసిత భారత్ యువజన పార్లమెంట్ పోటిల్లో ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీకి చెందిన విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచినట్లు ట్రిపుల్ఐటీ డైరెక్టర్ విజయ ప్రకాష్ పేర్కొన్నారు. గురువారం విజేతలను ప్రశంసిస్తూ మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటిల్లో కూడా ఇదేతరహా ఉత్తమ ప్రతిభ కనబరిచి యూనివర్సిటీకి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ప్రోత్సాహించారు. వీరి విజయానికి దోహద పడిన మెంటార్లు, మార్గదర్శకత్వం అందించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. నవంబర్ 6న ప్రొద్దుటూరులోని సిబిఐటి కళాశాలలో నిర్వహించిన ఈ పోటిల్లో ఇంజనీరింగ్ నాల్గో సంవత్సరం చదువుతున్న కంబగిరి స్వామి ప్రథమ బహుమతి, నాసీర్ అహ్మద్ తృతీయ బహుమతి సాధించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారిణి డా.రత్నకుమారి, ఎన్ఎస్ఎస్ అధికారి డా.కోనప్ప పాల్గొన్నారు.



శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో
ఎస్సై, పోలీస్ సిబ్బందికి ఘన సన్మానం

షష్టి ఉత్సవాల సందర్భంగా పోలీసుల సేవలను గుర్తించి సత్కరించిన ఆలయ నిర్వాహకులు

మద్దికేర, నవంబరు 12, అమరావతి వెలుగు : మండల కేంద్రమైన మద్దికేర గ్రామంలోని మద్దమ్మకుంట సమీపంలో వెలసిన సంతాన ప్రదాత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ఎస్సై, పోలీస్ సిబ్బందికి ఘనంగా సన్మానం నిర్వహించారు. డిసెంబర్ 14, 15, 16 తేదీల్లో జరగనున్న స్వామివారి షష్టి ఉత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎస్వీ శివప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో ఎస్సైతో పాటు పోలీస్ సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. షష్టి ఉత్సవాల నిర్వహణలో పోలీసుల సహకారం, సేవలను గుర్తిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాలయ సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



బుధగవి సర్పంచ్ అభ్యర్థిగా బండారు రేణుకమ్మ

పయవుల సోదరుల ఆశీస్సులతో అభ్యర్థిత్వానికి ఆమోదం

ఉరవకొండ, నవంబరు 12, అమరావతి వెలుగు : మండలంలోని బుధగవి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బండారు రేణుకమ్మ పేరును పయవుల సోదరుల ఆశీస్సులతో ఆమోదించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైతం ఆమె అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా బండారు రేణుకమ్మ మాట్లాడుతూ తనపై నమ్మకంతో సర్పంచ్ అభ్యర్థిగా ఆమోదం తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తన గెలుపుతో ప్రజలు, నాయకులు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు.



కార్యకర్త లోకేష్ కుటుంబానికి
ఉషశ్రీ చరణ్ పరామర్శ

గుండెపోటుతో లోకేష్ ఆకస్మిక మృతి.. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మాజీ మంత్రి

పెనుకొండ, నవంబరు 12, అమరావతి వెలుగు : నియోజకవర్గం లో రొద్దం మండలం దొడగట్ట గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త లోకేష్ గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం పట్ల మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.లోకేష్ మృతి విషయం తెలుసుకున్న ఆమె బుధవారం ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా లోకేష్ మృతికి సంతాపం తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తను కోల్పోవడం బాధాకరమని పేర్కొంటూ, ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. వారికి పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



భక్తుల సేవలో ముగ్గురు మిత్రులు..
పాదయాత్ర బృందానికి వైద్య, ఆహార కిట్ల పంపిణీ

రమాకాంత్ రెడ్డి, సీసీ హరిదాస్ చేతుల మీదుగా భక్తులకు కిట్లు అందజేత

పెనుకొండ, నవంబరు12, అమరావతి వెలుగు : సోమందేపల్లి నుంచి తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనార్థం పాదయాత్రగా బయలుదేరిన భక్తులకు గ్రామానికి చెందిన



ముగ్గురు మిత్రులు సేవా కార్యక్రమం నిర్వహించారు.తల్లం బాలాజీ, బంగారు షాప్ షాషా, వడ్డే శ్రీనివాస్‌లు పాదయాత్రికుల కోసం బిస్కెట్లు, గ్లూకోజ్, అవసరమైన మాత్రలు, ఆయింట్‌మెంట్ తదితర వస్తువులతో ప్రత్యేక కిట్లను సిద్ధం చేశారు. ఈ కిట్లను గ్రామ పెద్ద రమాకాంత్ రెడ్డి, టీడీపీ నాయకుడు సీసీ హరిదాస్ చేతుల మీదుగా పాదయాత్ర బృందంలోని భక్తులకు అందజేశారు.ఈ సందర్భంగా పాదయాత్రలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు పాటించాలనిఅవసరమైనప్పుడు మందులు వినియోగించాలని సూచించారు. భక్తుల యాత్రకు తమ వంతు సహకారం అందించిన ముగ్గురు మిత్రులను పలువురు అభినందించారు.

బాబా 101వ జయంతి వేడుకల భద్రతా చర్యలను...
పర్యవేక్షించిన డీఎస్పీ మాణిక్యరావు



పుట్టపర్తి, నవంబరు 12, అమరావతి వెలుగు : భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 101వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రశాంతి నిలయంలో జరుగుతున్న ఏర్పాట్లను, భద్రతాపరమైన చర్యలను పుట్టపర్తి డీఎస్పీ సి. మాణిక్యరావు పరిశీలించారు. వేడుకలకు దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో భక్తుల భద్రతకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రశాంతి నిలయంలో జన్మదినోత్సవ వేడుకలు నిర్వహించే ప్రదేశాలు, భక్తుల రాకపోకల మార్గాలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, రద్దీ నియంత్రణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో పుట్టపర్తి పట్టణ సీఐ యువరాజు పాల్గొన్నారు.

జనగణన ప్రక్రియను...
బాధ్యతాయుతంగా చేపట్టాలి

అనంతపురం నవంబరు12, అమరావతి వెలుగు : భారత జనాభా గణన--2027 ప్రక్రియను కచ్చితత్వంతో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఏ. మలోల సూచించారు. గురువారం అనంతపురం నగరంలోని జేఎన్‌టీయూలో ఫీల్డ్ ట్రైనర్లకు



జనాభా గణనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 18వ తేదీ వరకు జరిగే శిక్షణలో మాస్టర్ ట్రైనర్లు జనగణన చట్టం, జనాభా వివరాలు, కుటుంబ సభ్యులు, సామాజిక లక్షణాలు, విద్యార్హతలు, వృత్తి, వైకల్యాలు, వలసలు, జాతీయత తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభం కానున్న జనగణనలో పెద్దలు, చిన్నారులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేయనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని, వారికి మండల, మున్సిపల్ స్థాయిలో ప్రత్యేక శిక్షణ ఇస్తామని చెప్పారు. జనగణన వివరాలు భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన, ఎన్నికల నిర్వహణ, సంక్షేమ పథకాల అమలుకు కీలకమని పేర్కొన్నారు. సెన్సెస్ డిప్యూటీ డైరెక్టర్ దివాకర్ బరిహాస్ మాట్లాడుతూ జనగణనలో కచ్చితమైన సమాచారం సేకరించేందుకు శిక్షణ ఎంతో కీలకమన్నారు. ప్రతి ఇంటిని, ప్రతి కుటుంబ సభ్యుడిని మినహాయింపులు, పునరావృతాలు లేకుండా గణనలోకి తీసుకోవాలని సూచించారు. మొబైల్ యాప్ వినియోగం, వివరాల నమోదు విధానంపై సిబ్బందికి ఆచరణాత్మక శిక్షణ ఇవ్వాలని, సేకరించిన సమాచార గోప్యతను తప్పనిసరిగా కాపాడాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సెన్సెస్ ఏసీ డిహారి, గణాంక అధికారులు దీపక్ భరద్వాజ్, సీపీఓ బాలాజీ నాయక్, కలెక్టరేట్ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్లు, ఫీల్డ్ ట్రైనర్లు పాల్గొన్నారు.



కదిరిలో రేపటి నుంచి ధరణి...
నాణ్యమైన బియ్యం విక్రయాలు

కదిరి, నవంబరు 12, అమరావతి వెలుగు : ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి రైస్ విక్రయాలు కదిరి పట్టణంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పట్టణంలోని రాయచోటి రోడ్డులో ఉట్టి సమీపంలోని కాంప్లెక్స్‌లో ప్రత్యేక రైస్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ కిలో కేఎన్ఎం/ఆర్ఎన్ఆర్ బియ్యం రూ.50, బీపీటీ బియ్యం రూ.49 చొప్పున విక్రయించనున్నారు. 26 కిలోల ప్యాకెట్ల రూపంలోనూ బియ్యం అందుబాటులో ఉంటాయి. గురువారం శ్రీ సత్యసాయి జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రత్యేక రైస్ కౌంటర్‌ను సందర్శించి బియ్యం నిల్వలు, నాణ్యత, విక్రయ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన బియ్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొని, శుక్రవారం నుంచి విక్రయాలు ప్రారంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో కదిరి పౌరసరఫరాల ఉప తహసీల్దార్ పాల్గొన్నారు. కదిరి మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరారు.



మడకశిరలో కూటమి విజయోత్సవ ర్యాలీ

మడకశిర, నవంబరు12, అమరావతి వెలుగు : మడకశిర మున్సిపాలిటీలోని 23 వార్డులతో పాటు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఐదు జడ్పీటీసీ స్థానాలను కూటమి కైవసం చేసుకున్న సందర్భంగా గురువారం పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నాయకత్వంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి జ్యోతిరావు పూలే సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ఐదు మండలాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుండుమల శారదా రాధాకృష్ణ, కుంచిటి కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, వివిధ కార్పొరేషన్ల ప్రతినిధులు, మండల కన్వీనర్లు, ఇతర నాయకులు పాల్గొని విజయోత్సవాన్ని జరుపుకున్నారు. ప్రజల విశ్వాసం, కూటమి ఐక్యత, కార్యకర్తల కృషితోనే ఈ విజయం సాధ్యమైందని నాయకులు పేర్కొన్నారు.





పోలింగ్ కేంద్రాల భద్రతా ఏర్పాట్లను...
పరిశీలించిన డీఎస్పీ మాణిక్యరావు













పుట్టపర్తి, నవంబరు 12, అమరావతి వెలుగు : గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని పుట్టపర్తి డీఎస్పీ సి. మాణిక్యరావు పోలీసు అధికారులకు సూచించారు. పుట్టపర్తి గ్రామీణ పరిధిలోని ఆర్డీవో కార్యాలయం, ఓబులదేవరచెరువు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఓబులదేవరచెరువు మండలంలోని ఇనగలూరు గ్రామాన్ని సందర్శించి అక్కడి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, కేంద్రాల పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యవేక్షించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో డీడీఓ నరేష్ కుమార్, పుట్టపర్తి గ్రామీణ ఎస్ఐ క్రాంతి కుమార్, ఓబులదేవరచెరువు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి, పోలీసు సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణకు ఉచిత హ్యాండ్‌హెల్డ్ ఎక్స్‌రే పరీక్షలు

కదిరి, నవంబరు 12, అమరావతి వెలుగు : కుటాగుళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా హ్యాండ్‌హెల్డ్ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కదిరి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నవారు, సాయంత్రం వేళల్లో జ్వరం వస్తున్నవారు, ఆకలి మందగించడం, దగ్గినప్పుడు కళ్లెంలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా ఎక్స్‌రే పరీక్షలు చేయించుకోవాలన్నా రు. మధుమేహం, రక్తపోటు ఉన్నవారు, ధూమపానం, మద్యపానం చేసేవారు, 60 ఏళ్లు పైబడినవారు, గతంలో క్షయ వ్యాధికి చికిత్స పొందినవారు, వారి కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు కూడా ఈ పరీక్షలను వినియోగించుకో వాలని కోరారు. ప్రభుత్వం క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్యంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని, హ్యాండ్‌హెల్డ్ ఎక్స్‌రే పరీక్షల ద్వారా కేవలం రెండు నిమిషాల్లోనే ఫలితాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. వ్యాధిని తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స పొందడం ద్వారా క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రోజా, టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, టీబీహెచ్‌వీ పద్మావతి, పీపీఎస్‌ఏ విశ్వనాథ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



జనగణన రెండో దశ పకడ్బందీగా...

నిర్వహించాలి

పుట్టపర్తి, నవంబరు 12, అమరావతి వెలుగు : జిల్లాలో జనగణన రెండో దశ ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులకు సూచించారు. జనగణన గణాంకాలు దేశ ప్రగతి, భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా జనగణన నోడల్ అధికారి సూర్యవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఫీల్డ్ ట్రైనర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో జనగణన విజయవంతం కావడంలో ఫీల్డ్ ట్రైనర్ల పాత్ర కీలకమని, వీరు తదుపరి సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు సమగ్ర శిక్షణ అందించాలని సూచించారు. జనగణన మార్గదర్శకాలు, విధివిధానాలపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జనగణన రెండో దశలో భాగంగా జనవరి 10 నుంచి 24 వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించనున్నారు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబ వివరాలను సేకరిస్తారు. మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు సేకరించిన వివరాల పునఃపరిశీలన చేపడతారు. జిల్లా జనగణన నోడల్ అధికారి సూర్యవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంబంధించిన ఖచ్చితమైన, వాస్తవ సమాచారాన్ని సేకరించాలని సూచించారు. జనగణనకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సరైన వివరాలు అందించి సహకరించాలని కోరారు. శిక్షణ పొందిన ఫీల్డ్ ట్రైనర్లు ఎన్యూమరేటర్లకు శిక్షణ అందించడంతోపాటు, క్షేత్రస్థాయి ప్రక్రియను సూపర్‌వైజర్లు నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు.







స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీ

ఏర్పాట్లు చేపట్టాలి

పుట్టపర్తి, నవంబరు 12, అమరావతి వెలుగు : రాష్ట్రంలో 23 పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీల రెండో సాధారణ ఎన్నికలను నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతిలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు, జిల్లా పంచాయతీ అధికారులు, పురపాలక అధికారులతో ఆయన దృశ్యమాధ్యమ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పుట్టపర్తి కలెక్టరేట్‌లోని దృశ్యమాధ్యమ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ. శ్యామ్ ప్రసాద్, అదనపు ఎస్పీ అంకిత సురాన పాల్గొన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న సన్నద్ధత, ఏర్పాట్ల వివరాలను కమిషనర్‌కు వివరించారు. సంబంధిత ఎన్నికల విభాగం, పోలీసు, పురపాలక శాఖల అధికారులు పాల్గొన్నారు.





రెండో సాధారణ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సమీక్ష

అనంతపురం

రాష్ట్రంలోని 23 పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలకు సంబంధించి రెండో సాధారణ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ (రిటైర్డ్ ఐఏఎస్) గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు, జిల్లా పంచాయతీ అధికారులు, పట్టణ స్థానిక సంస్థల కమిషనర్లు పాల్గొన్నారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.





బాల్య వివాహ రహిత జిల్లాగా...

శ్రీ సత్యసాయిని తీర్చిదిద్దాలి

పుట్టపర్తి, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లాను సంపూర్ణ బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చా రు. బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణలను పూర్తిస్థాయిలో నివారించేందుకు సమష్టి కృషి అవసరమని స్పష్టం చేశారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు దెబ్బతింటాయని, చిన్న వయస్సులో గర్భధారణ తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. బడి మానేసిన బాలికలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని, అంగన్‌వాడీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కౌమార బాలికల ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. 18 ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహ నిషేధ చట్టం–2006 ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాల సమాచారం తెలిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు తెలియజేయాలని కోరారు. ఈ నెల 27న నిర్వహించనున్న అంతర్జాతీయ బాల్య వివాహాలు, బలవంతపు వివాహాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 'మేము సైతం – బాల్య వివాహాలకు వ్యతిరేకంగా చేతన' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుమారు వెయ్యి మందిని భాగస్వాములను చేసి బాల్య వివాహాల వ్యతిరేకంగా బాండ్లను సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలన ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సమావేశంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. ప్రమీల, డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం, డీఈఓ కిష్టప్ప, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ, డీసీపీఓ మహేష్, ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు వీరనారాయణ, రామన్న, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.







12వ వేతన సవరణ సంఘానికి

అదనపు సిబ్బంది నియామకం

అమరావతి, నవంబరు 12, అమరావతి వెలుగు : 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) కమిషనర్ కార్యాలయ పరిపాలనా పనుల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సిబ్బందిని నియమించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ గురువారం జీఓ ఆర్టీ నంబర్ 3153 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. రిటైర్డ్ అసిస్టెంట్ సెక్రటరీ పీటీవీఎస్ఎస్ శివకుమార్‌ను పీఆర్సీ కమిషనర్‌కు ప్రైవేట్ సెక్రటరీగా, బి. వెంకటేశ్వరరావును పీఆర్సీ కార్యదర్శికి వ్యక్తిగత సహాయకుడిగా నియమించింది. వీరిని ఏడాది పాటు ఒప్పంద ప్రాతిపదికన పునర్నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నియామకాలతో పీఆర్సీ కార్యాలయ పరిపాలనా కార్యకలాపాలకు అదనపు బలం చేకూరనుంది. కమిషన్‌కు అవసరమైన ఇతర సిబ్బందిని కూడా త్వరితగతిన నియమిస్తే నివేదిక రూపకల్పన, సమర్పణ ప్రక్రియ వేగవంతమవుతుందని ఉద్యోగ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. వేతన సవరణ నివేదిక సకాలంలో అందుబాటులోకి వచ్చి ఉద్యోగుల వేతన సవరణ ప్రక్రియ ముందుకు సాగాలని ఉద్యోగులు ఆకాంక్షిస్తున్నారు.

డీవీఎంసీ కమిటీలో అనధికార సభ్యుల నియామకానికి

దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి నవంబరు12, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరిగే అత్యాచారాలు, వివక్షను అరికట్టేందుకు జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ)ని నూతనంగా ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ కమిటీలో ఎనిమిది మంది అనధికార సభ్యులను నియమించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి ఐదుగురు, ఇతర వర్గాలైన ఓసీ, బీసీ, మైనారిటీల నుంచి ముగ్గురిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా డిగ్రీ విద్యార్హత కలిగి ఉండాలని, ఇతర వర్గాల నుంచి దరఖాస్తు చేసుకునేవారు సమాజ సేవలో గుర్తింపు పొంది, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేసిన అనుభవం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అభ్యర్థులపై ఎలాంటి పోలీసు కేసులు ఉండకూడదని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు పుట్టపర్తి పట్టణంలోని వెస్ట్ గేట్ సమీపంలోని దీన జనోద్ధరణ భవన సముదాయంలో ఉన్న జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత కార్యాలయం (గదులు 5, 6)లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 23వ తేదీ చివరి గడువుగా నిర్ణయించినట్లు కలెక్టర్ వెల్లడించారు.



నిర్దేశిత గడువులోగా భూముల...

రీసర్వే లక్ష్యాలను పూర్తి చేయాలి

పుట్టపర్తి, నవంబరు 12, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో రీసర్వే పనుల పురోగతిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే డిసెంబరులో పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించిన గ్రామాల వివరాలను ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న మూడు లోపభూయిష్ట గ్రామాల్లో సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి, పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రీసర్వే పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు, సర్వే శాఖ అధికారులు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, రీసర్వే ఉప తహసీల్దార్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.





రేషన్ కార్డుదారులకు రాయితీపై...

నిత్యావసర సరుకులు

అమరావతి నవంబరు 12, అమరావతి వెలుగు : క్రిస్మస్, సంక్రాంతి పండుగల నేపథ్యంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఊరట కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రేషన్ కార్డుదారులకు చౌక ధరల దుకాణాల ద్వారా రాయితీ ధరలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయనుంది. మార్కెట్ జోక్యం కార్యక్రమంలో భాగంగా కిలో కందిపప్పు రూ.100, లీటరు పామాయిల్ రూ.125, కిలో గోధుమ పిండి రూ.25 చొప్పున అందించనున్నారు. డిసెంబరు నుంచి వరుసగా మూడు నెలల పాటు ఈ ప్రత్యేక పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ పథకం అమలుకు మూడు నెలల కాలంలో ప్రభుత్వంపై సుమారు రూ.300.60 కోట్ల ఆర్థిక భారం పడనుంది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్, ప్రభుత్వ ఎక్స్-అఫీషియో కార్యదర్శి కె. కన్నబాబు ఉత్త ర్వులు జారీ చేశారు. పండుగల సమయంలో నిత్యావసర వస్తువులను తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సామాన్య కుటుంబాలపై ఆర్థికభారం తగ్గనుంది.



Edited, Printed, Published & Owned by : JANAPATI VENKATA RAMESH BABU, #1-1189-21A, NGO Colony, KADIRI - 515591, Anantapuramu (Dist.), AP (State) and Printed at M/s AK PUBLICATIONS, #1-1189-2A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist), AP (State) and Published at #1-1189-21A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist.), (A.P), Editor : JANAPATI VENKATA RAMESH BABU, RNI No. APTEL / 2022 / 85169, E-mail : amaravathivelugu@gmail.com, Cell: 9440814576